

'అధికారులంతా పీజీఆర్‌ఎస్‌కు హాజరవ్వాలి'

పార్వతీపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు అధికారులంతా తప్పనిసరిగా హాజరవ్వాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ముఖ్య శాఖల అధికారులు గైర్హాజరు కారాదని తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలపై ఉదయం 10 గంటల నుంచి వినతిపత్రాలు ఇవ్వొచ్చన్నారు. పీజీఆర్‌ఎస్ అనంతరం శంబర జాతర్‌పై సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫ్రీహోల్డ్‌పై ఫోకస్!



- దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం
- గత వైసీపీ సర్కారు హయాంలో అడ్డగోలుగా సాగిన వ్యవహారం
- రెవెన్యూ శాఖపై ఆ పార్టీ నేతల ఒత్తిడి
- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై ఎన్నో అనుమానాలు
- నివేదికలు సిద్ధం చేసిన అధికారులు
- అక్రమార్కుల్లో వణుకు

పార్వతీపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ సర్కారు హయాంలో జిల్లాలో అడ్డగోలుగా సాగిన ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వాటిపై నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో క్షేత్రస్థాయి సిబ్బంది సర్వం సిద్ధం చేశారు. నిబంధనల ప్రకారం ఫ్రీ హోల్డ్ అయితే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. కానీ అందుకు విరుద్ధంగా జరిగినట్లు రుజువైతే మాత్రం సంబంధిత సిబ్బంది లేదా అధికారులపై చర్యలు ఉంటాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి నేతల ఒత్తిడి మేరకు నడుచుకున్న కొంత మంది రెవెన్యూ సిబ్బంది, అధికారుల్లో ఆందోళన నెలకొంది. నివేదికలు సిద్ధంగా ఉండడంతో ఎవరిపై ఎటువంటి చర్యలు ఉంటాయో.. ఎవరు బాధ్యులవుతారోనని టెన్షన్ పడుతున్నారు.

వైసీపీ హయాంలో..

గతంలో ప్రభుత్వాలు పేదలకు భూములు పంపిణీ చేసి వారి జీవనోపాధికి మార్గం చూపేవారు. అయితే కొంత మందికి ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోవడం తదితర కారణాలతో (మిగతా 8వ పేజీలో...)

ఇదీ పరిస్థితి..

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా పరిధిలో 16,153 మందికి సంబంధించి సుమారు 16,201 ఎకరాలు ఫ్రీ హోల్డ్ అయ్యాయి. ఇందులో 58 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేశారు.
- కొమరాడ మండలంలో 552 ఎకరాల 942 సెంట్లు, గరుగుబిల్లిలో 262 ఎకరాల 64 సెంట్లు, పార్వతీపురంలో 2672 ఎకరాల 56 సెంట్లు, బలిజిపేటలో 754 ఎకరాల 46 సెంట్లు, సాలూరులో 525 ఎకరాల 92 సెంట్లు, పాచిపెంటలో 18 ఎకరాల 63 సెంట్లు, మక్కువలో 2472 ఎకరాల 42 సెంట్లు, సీతానగరంలో 737 ఎకరాల 135 సెంట్లు చొప్పున మొత్తంగా పార్వతీపురం డివిజన్‌లో 7, 996 ఎకరాల 707 సెంట్లు ఫ్రీ హోల్డ్ భూములుగా నమోదయ్యాయి. ఇందులో 50 ఎకరాల 891 సెంట్లకు రిజిస్ట్రేషన్ పూర్తయింది.
- పాలకొండ డివిజన్ పరిధి గుమ్మలక్ష్మీపురం మండలంలో 677 ఎకరాల 221 సెంట్లు, కురుపాంలో 68 ఎకరాల 67 సెంట్లు, పాలకొండలో 39 ఎకరాల 93 సెంట్లు, సీతంపేటలో 4,674 ఎకరాల 58 సెంట్లు, భామినిలో 1,824 ఎకరాల 2 సెంట్లు చొప్పున అన్ని మండలాల్లో 8,205 ఎకరాల 22 సెంట్లు భూమి ఫ్రీ హోల్డ్‌గా మారింది. ఇందులో 7.54 ఎకరాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది.
- పార్వతీపురం, సీతంపేట, భామిని, మక్కువ తదితర మండలాల్లో వేలాది ఎకరాలు ఫ్రీ హోల్డ్‌గా మారాయి.

ఘనంగా కందికొత్తల పండగ

- గుమ్మలక్ష్మీపురంలో వేడుకలు
- హాజరైన ప్రభుత్వ విప్, కలెక్టర్

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం హెచ్ గ్రౌండ్‌లో ఆదివారం కందికొత్తల పండగను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గిరిజనులు సంప్ర దాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హాజరయ్యారు. తొలుత కలెక్టర్ పండగ వేడుకలను ప్రారంభించారు. అనంతరం గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేశారు. హెచ్ గ్రౌండ్ సమీపంలోని కొండపై ఉన్న దుర్గమ్మ గుడిని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి గిరిజన యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం మహేంద్ర, తహసీల్దార్ శివన్నారాయణ, టీడీపీ కన్వీనర్ పాడి సుధ, గిరిజన నాయకులు కృష్ణబాబు, భారతి, కళావతి, సింహాచలం, సర్పంచ్‌లు గౌరీశంకరరావు, చైతన్య స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న కలెక్టర్, విప్ తదితరులు

రూ.257 కోట్లతో రహదారుల నిర్మాణం

జిల్లాలోని కొండశిఖర గ్రామాల్లో సుమారు రూ.257 కోట్లతో రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్థానిక విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రధానంగా రోడ్లు, కాలువలు, ఇతరత్రా అభివృద్ధి పనులకు భారీగా నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధిలో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో కిశోర బాలికలకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఏనుగుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

పార్వతీపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే టెన్త్ విద్యార్థులపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. కొద్ది నెలల్లో పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో రాత్రివేళల్లో వారు ఎలా చదువుతున్నారో ఉపాధ్యాయులు గమనించాలన్నారు. అవసరం మేరకు విద్యార్థుల ఇళ్లను అప్పుడప్పుడు సందర్శించాలన్నారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది కూడా టెన్త్ ఉత్తీర్ణత శాతంలో జిల్లాను రాష్ట్ర స్థాయిలో తొలి స్థానంలో నిలపాలన్నారు. విద్యార్థుల అటెండెన్స్ 95 శాతానికి తగ్గకుండా ఉండాలన్నారు. టెన్త్ తర్వాత ఏం చదవాలి, ఎలా సిద్ధం కావాలి వంటి అంశాలను విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో డీఈవో ఎస్.తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కదలవు.. వదలవు!

- సుంకిలోనే సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం సుంకి గ్రామాన్ని ఏనుగులు వదలడం లేదు. గత కొద్ది రోజులుగా ఆ గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. మరోవైపు పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఆదివారం గ్రామంలో వ్యవసాయ మోటారు, పైపులతో పాటు పామాయిల్ మొక్కలను ధ్వంసం చేశాయి. గత పది రోజులుగా ఏనుగుల సంచారంతో వరి, అరటి, పామాయిల్ పంటలతో పాటు దుకాణాలను నష్టపోయిన వారు లబోదిబోమంటున్నారు. మరోవైపు ఏ నిమిషంలో గజరాజులు గ్రామంలోకి వస్తాయోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. సంబంధిత అటవీ శాఖాధికారులు స్పందించి వాటిని తరలించే చర్యలు చేపట్టాలని ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అటవీశాఖ రేంజర్ మణికంఠేష్‌ను వివరణ కోరగా.. 'జిల్లాలో 11 ఏనుగులు సంచరిస్తున్నాయి. వాటిని తరలించేందుకు పార్వతీపురం మండలం గుచ్చిమి దగ్గర ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే 36 మంది ట్రాకర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. కొంకి ఏనుగు తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నాం.' అని తెలిపారు.



పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

నేడు చదురుగుడికి పెదపోలమాంబ



మక్కువ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత , భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ జాతర తొలి ఘట్టానికి సర్వం సిద్ధమైంది. ఇప్పటికే దేవదాయ శాఖాధికారులు, గ్రామస్థులు సంబంధిత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జనవరి 27, 28, 29 తేదీల్లో జాతర జరగనున్న నేపథ్యంలో పోలమాంబ మేనత్త పెదపోలమాంబ ఘటాన్ని సోమవారం జన్నివారి ఇంటి నుంచి ఎస్.పెద్దవలస రహదారిలో ఉన్న గద్దె వద్ద తీసుక రానున్నారు. ఆ తర్వాత చదురుగుడికి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా డప్పు, వాయిద్యాల మధ్య పెదపోలమాంబను గ్రామంలోకి ఆహ్వానిస్తున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. బుధవారం తిరిగి అమ్మవారిని గద్దె వద్దకు చేర్చనున్నారు.

పోలీసు నియామక ప్రక్రియకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జనవరి 22 వరకూ ఎంపికలు
- 9,152 మంది అభ్యర్థులు.. రోజుకు 600 మందికి పరీక్షలు

విజయనగరం క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో పోలీసు కానిస్టేబుళ్ల ఉద్యోగ నియామకాల ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. కంటోన్మెంట్‌లోని ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న పరేడ్ గ్రౌండ్‌లో ఈ ప్రక్రియ ఈ నెల 30 నుంచి జనవరి 22 వరకూ కొనసాగనుంది. మొత్తం 9,152 మంది అభ్యర్థుల్లో రోజుకు 600 మంది చొప్పున పాల్గొనున్నారు. తొలుత విద్యార్హత, జనన, కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుంది. ఒరిజినల్ సర్టిఫికెట్‌లను తనిఖీ చేస్తారు. గజిటెడ్ అధికారి సంతకంతో కూడిన జిరాక్స్ సెట్‌ను అభ్యర్థులు తీసుకురావాల్సి ఉంటుంది. అభ్యర్థి ఎత్తు, ఛాతి కొలతలకు సంబంధించిన ప్రక్రియంతా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించనున్నారు. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి అతి కీలకంగా ఉన్న 1,600 మీటర్ల పరుగు పందెం నిర్వహించనున్నారు. ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్‌తో పాటు ఎత్తు, ఛాతి కొలతలు పూర్తయిన తరువాత 1,600 మీటర్ల పరుగుకు అభ్యర్థులను అనుమతిస్తారు. ఈ ప్రక్రియ కూడా పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. 1,600 మీటర్ల పరుగు పందెం పూర్తయిన వారికి 100 మీటర్ల పరుగు, చివరి పరీక్ష లాంగ్ జంప్ ఉంటుంది. పోలీసు ఉద్యోగ నియామకాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.



పరుగు పందేనికి సిద్ధం చేసిన మైదానం



విశాఖ నుంచి పార్వతీపురానికి ప్రత్యేక రైలు

కొత్తవలస, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని విశాఖపట్నం నుంచి పార్వతీపురం వరకు ప్రత్యేక రైలు (08565-66) నడుపుతున్నట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. జనవరి 10 నుంచి 20వ తేదీ వరకు ఈ రైలు నడుస్తుందన్నారు. విశాఖలో ఉదయం 10 గంటలకు బయలుదేరి పార్వతీపురానికి మధ్యాహ్నం 12.20కు చేరుకుంటుందని, మళ్లీ పార్వతీపురంలో మధ్యాహ్నం 12.45కు బయలుదేరి విశాఖకు సాయంత్రం నాలుగు గంటలకు చేరుకుంటుందన్నారు. అదేవిధంగా ఒడిశా రాష్ట్రం కటక్ నుంచి హైదరాబాద్‌కు జనవరి 7,14, 21 తేదీల్లో ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

నిర్మించారు సరే.. ప్రారంభించేదెప్పుడు?
- నిరుపయోగంగా భామిని ఆశ్రమ పాఠశాల అదనపు భవనం
8లో

ఎయిర్‌ఫోర్స్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- ఫిబ్రవరి 1, 2 తేదీల్లో రిక్రూట్‌మెంట్ ర్యాలీ
8లో

ఇది నాటి సర్కారు పాపం



గుడ్డిమీదగూడలో పునాది దశలో నిలిచిపోయిన పాఠశాల భవనం

- సకాలంలో బిల్లులు చెల్లించని గత వైసీపీ ప్రభుత్వం
- పూర్తికాని నాడు-నేడు పనులు.. పునాది దశలోనే భవనాలు
- గిరిజన విద్యార్థులకు అవస్థలు.. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

సీతంపేట రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేస్తామని.. గిరిజన విద్యను బలోపేతం చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. ఆచరణలో మాత్రం చతికిలపడింది. అప్పట్లో ఈ పథకం కింద సకాలంలో నిధులు మంజూరు చేయలేదు. దీంతో సీతంపేట ఐటీడీఏ పరిధిలో చాలాచోట్ల ఆ పనులు పూర్తికాలేదు. దీంతో గిరిజన విద్యార్థులకు వసతి సమస్య వేధిస్తోంది. చాలీచాలని ఇరుకు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులపాలవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీతంపేట ఏజెన్సీలో నాడు-నేడు కింద మొదటి విడతలో 38 పాఠశాలలను ఎంపిక చేశారు. సుమారు రూ.13 కోట్లతో అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్లు, పాఠశాలల చుట్టూ ప్రహరీల నిర్మాణం చేపట్టారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం వంటివి కల్పించారు.
- రెండో విడతలో 57 జీపీఎస్(టీడబ్ల్యూ), ఎంపీయూపీ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పన కోసం రూ.9కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం అరకొరగానే నిధులు మంజూరు చేసింది. దీంతో సకాలంలో నిధులు మంజూరు కాక వివిధ పాఠశాలల భవన నిర్మాణాలు పునాది దశలోనే అర్ధాంతరంగా నిలిచిపోయాయి కేవలం మూడు పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో నిలిచిపోయాయి. గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో మూడో విడతలో మంజూరైన పనులు కూడా పూర్తి కాలేదు. దీంతో ఎంతో విలువైన ఐరన్ తుప్పపట్టి ఎందుకు పనికి రాకుండా పోతోంది. కొన్ని గ్రామాల్లో అయితే నాడు-నేడు పాఠశాలల పునాదుల కోసం వినియోగించిన ఇనుప చువ్వల పై గ్రామస్థులు దుస్తులు ఆరేసుకుంటున్నారు.
- సీతంపేట ఐటీడీఏ పరిధిలోని బెన్నరాయి, పూతికవలస, చిన్నపల్లంకి, తాడిపాయి, సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జజ్జువ, గడిగుజ్జి, బుడ్డడుగూడ, దిగువ బుడగరాయి తదితర పాఠశాలలకు వసతి సమస్య వేధిస్తోంది. జీపీఎస్, ఆశ్రమ పాఠశాలలు, ఎంపీయూపీ పాఠశాలల్లోని చాలీచాలని తరగతి గదుల్లో గిరిజన విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేదు. విద్యుత్ సౌకర్యం (మిగతా 8వ పేజీలో...)



బెన్నరాయిలో దుస్తులు ఆరవేసిన దృశ్యం

తాగు నీరు లేదు.. మరుగుదొడ్లు లేవు

- వర్షాకాలంలో విద్యార్థులకు తప్పని అవస్థలు
- ఇదీ మద్దువలస జూనియర్ కళాశాలలో పరిస్థితి

వంగర డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు తిష్ఠ వేశాయి. 1986లో ప్రారంభించిన కళాశాలలో కనీస వసతులు కొరవడ్డాయి. ఇక్కడ కనీసం తాగునీటి సదుపాయం లేదు. మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం 13 గదులు ఉన్నాయి. ఇక్కడ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన 480 మంది చదువుతున్నారు. ప్రధానంగా తాగునీటి వసతి లేకపోవడంతో ఇళ్ల నుంచే బాటిళ్లతోనే నీటిని తీసుకువస్తున్నారు. గతంలో ఓ క్వారీ నిర్వాహకుడు ట్యాంకర్‌తో నీటిని సమకూర్చేవాడు. ప్రస్తుతం ఆ క్వారీ నిర్వహణ నిలిపివేయడంతో తాగునీటి సరఫరాను ఆపేశాడు. కళాశాల నిర్మించి నాలుగు దశాబ్దాలు గడుస్తున్నా ఇక్కడ శాశ్వతమైన నీటి పథకాలు నిర్మించని పరిస్థితి నెలకొంది. కళాశాల ప్రాంగణంలో పార్కింగ్ చేసుకునే ప్రాంగణం బురదమయంగా మారింది. పరిసరాలు లోతుగా ఉండడంతో చిన్నపాటి వర్షం కురిస్తే నీరుచేరుతోంది. దీంతో సిబ్బంది, విద్యార్థులు తరగతి గదులకు, కార్యాలయానికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో మరుగు దొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సివస్తోంది. ఈనేపథ్యంలో విద్యార్థుల కోసం నిర్మించిన మరుగుదొడ్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇక్కడ చదువుతున్న 90 మంది విద్యార్థినులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. కళాశాల ప్రహరీ లేకపోవడంతో ప్రాంగణంలోకి మరుగుదొడ్లు వచ్చి పరిసరాలను ధ్వంసం చేస్తున్నాయి. దీనికి కళాశాలకు ఆనుకుని కొండ ఉండడంతో పాములు, విషసర్పాలు వస్తుండడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రయోగశాలల్లో కనీస వసతులు లేకపోవడంతో సక్రమంగా ప్రయోగాలు చేయలేకపోతున్నామని వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



కళాశాల ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త

పర్యవేక్షణ లేక.. వ్యర్థాలు తొలగించక

- గాడితప్పిన కాలువల నిర్వహణ
- చోద్యం చూస్తున్న మునిసిపల్ అధికారులు
- ఇదీ రాజాంలో పరిస్థితి

రాజాం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలోని కాలువలు నిర్వహణ గాడితప్పింది. ప్రధానంగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రోజుల తరబడి చెత్త, వ్యర్థాలు తొలగించడం లేదు. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా, మాధవబజార్, బజార్‌రోడ్డు, శ్రీనివాసరోడ్డుతోపాటు వీధుల్లో కాలువలు వ్యర్థాలతో పూడుకుపోయాయి. కాలువలకు ఆనుకుని వ్యాపారాలు చేస్తున్న పానీపూరీ, చాట్‌బళ్లు, టిఫిన్ కేంద్రాలు, ఖాళీ కొబ్బరి బొండాలు, కూరగాయల వ్యర్థాలు పడేస్తున్నారు. వ్యాపారులు పాలిథిన్ కవర్లు, వ్యాపారాలకు సంబంధించిన ఇతర వ్యర్థాలను కొంతమంది రోడ్డుపై పడేస్తుండగా మరికొంత మంది కాలువల్లో వేస్తున్నారు. కాలువల్లో మురుగునీటితో పాటు వ్యర్థాలు కుళ్లిపోయి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇళ్లల్లోని చెత్త కూడా వేయడంతో కాలువలు నిండిపోయి దుర్గంధపూరితంగా మారుతోంది. ప్రజారోగ్యానికి భంగం కలిగించే వ్యక్తులు, వ్యాపారులపై మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోకుండా చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



మల్లికార్జున కాలనీలోని కాలువలో పేరుకుపోయిన చెత్త

రేపు తెలగ సమన్వయ సదస్సు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయనగరం శివార్లలోని గంట్యాడ రహదారిలోని జగదాంబనగర్‌లో మంగళవారం ఉత్తరాంధ్ర తెలగ సమన్వయ సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎజ్జు మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన తెలగ సంక్షేమ సంఘం ప్రతినిధులు సదస్సుకు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

రేపటిలోగా పంటల బీమా నమోదు చేసుకోవాలి

విజయనగరం కలెక్టరేట్,డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు వాతావరణ ఆధారిత బీమా పథకంలో అవకాశం కల్పించడంతో ప్రీమియం మంగళవారంలోగా నమోదుచేసుకోవాలని ఉద్యానఅధికారి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మామిడి పంటకు పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ పంటల ఆధారిత పంట బీమా పథకంలో భాగంగా (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ బీమాచెల్లించేందుకు ఒప్పందం చేసుకుందని పేర్కొన్నారు.2024-25 రబీలో మామిడి పంటకు బీమా అమలుచేసినట్లు తెలిపారు.

సీవోపీ దరఖాస్తు గడువు పెంపు

కొత్తవలస, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వృత్తిలో ఉంటూ ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులు ప్రాక్టీసు సర్టిఫికెట్‌ను(సీవోపీ) ఫిబ్రవరి 15లోగా రెన్యువల్ చేయించుకునేందుకు ఏపీ బార్ కౌన్సిల్‌కు గడువు పొడిగించినట్లు కొత్తవలస న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి ఒక ప్రకటనలో తెలిపారు.న్యాయవాదులు ప్రాక్టీసుచేస్తున్నట్టు న్యాయవాద సంఘం అధ్యక్షులు గాని, ప్రధాన కార్యదర్శిగాని ధ్రువపత్రం తప్పనసరిగా ఇవ్వాలని తెలిపారు.

'బీసీ బీ'లో చేర్చాలి

విజయనగరం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని యాదవులను బీసీ బీలో చేర్చాలని జిల్లా యాదవ సంక్షేమ సంఘం నాయకులు మన్యాల కృష్ణ, గదుల సత్యలత, ప్రసాదుల ప్రసాద్‌లు కోరారు. ఆదివారం శ్రీకాకుళంలో జరిగిన ఉత్తరాంధ్ర స్థాయి యాదవ ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడుతూ సామాజిక, ఆర్థికంగా ఉత్తరాంధ్రలో యాదవులు వెనుకబడి ఉన్నారని తెలిపారు.

వాకర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

విజయనగరం రూరల్, డిసెంబరు 29: (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ప్రగతి వాకర్స్ క్లబ్ విస్తృతస్థాయి సమావేశం క్లబ్ ఆవరణలో అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, అప్పలరాజు రెడ్డిల ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసరావు (సోనీ శ్రీను), ప్రధాన కార్యదర్శిగా సూరిబాబు రెడ్డి, కోశాధికారిగా సూరంపల్లి కోటేశ్వరరావుతోపాటుజాలీవాకర్‌గా దున్న సూరిబాబు మరో 15 మందిని ఎన్నుకున్నారు.

భూమిని అప్పగించండి

జామి,డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అట్టాడ పంచాయతీ పరిధిలో వేసిన ఓ ప్రైవేట్ లేఅవుట్‌లో ఉన్న ప్రభుత్వభూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు పంచాయతీకి చెందాల్సిన స్థలాన్ని తమకు అప్పగించాలని సర్పంచ్ పోతన అమ్మన్నదొర ఒక ప్రకటనలో ఆదివారం కోరారు. కొద్దేళ్లుగా అధికారులను స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఈ విషయంపై మరోసారి జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలి

నెల్లిమర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, కాస్మోటిక్స్ చార్జీలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లిమర్లలోని ఆశ్రమ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆ సంఘం ప్రతినిధి ప్రకాష్ సంఘం పతాకాన్ని ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో జె.రవికుమార్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

●కొత్తవలస, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని ఎస్ఎఫ్ఐ కమిటీ జిల్లా సభ్యురాలు భారతి తెలిపారు. కొత్తవలసలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం కోసమే ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందని తెలిపారు.

●శృంగవరపుకోట డిసెంబరు 29 : ఎస్.కోటలోని పలు వసతిగృహాల్లో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. మండల గర్ల్స్ కన్వీనర్ అను, అధ్యక్షుడు చైతన్య ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ జెండా ఎగురవేశారు.

ఉపాధికి పెద్దపీట వేస్తాం: మంత్రి కొండపల్లి



సర్పంచ్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

బొండపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో ఉత్తరాంధ్ర అభివృద్ధికి, యువత ఉపాధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, ఎన్‌ఆర్ఐ సాధికారిత సంబంధాలు శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఐకమత్యంతో గ్రామాలు ముందుకు వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబుకు మద్దతుగా నిలబడాలని కోరారు. ఆదివారం మండలంలోని బిళ్లలవలసలో సర్పంచ్ దంపతులు నెట్టి ఏసురత్నం, ముకుంద, మాజీ సర్పంచ్‌లు నెట్టి ఆనందరావు, బూర్లె అనూరాధ, మాజీ ఉప సర్పంచ్ కడగల కొండమ్మ, ముగ్గురు వార్డు సభ్యులతో పాటు 250 కుటుంబాలు, బొండపల్లి పంచాయతీలోని గొల్లలపేటకు చెందిన పలుకుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ నాయకులు విద్యుత్‌చార్జీలు పెరిగాయని నిరసనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కోరాడ కృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము సర్పంచ్‌లు నంబూరి రాజేష్, కర్రోతు శ్రీనివాసరావు, మీసాల జానకిరావు, ముదునూరు శ్రీనివాస రాజు, పత్తిగుల్ల రాజినాయుడు, సాసుబిల్లి కాశీవిశ్వనాథం, గోపాలరాజు, ముంజేటి పార్వతి పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

●ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



బాధితులతో మాట్లాడుతున్న కలిశెట్టి అప్పలనాయుడు, మురళీమోహన్

సంతకవిటి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సిరిపురం అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటామని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం సిరిపురం పొందర వీధిలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను ఆదివారం పరామర్శించారు. తొలుత కాలిపోయిన ఇళ్లను పరిశీలించి, ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. నగదు, సామగ్రి, ఇళ్లు కాలి బూడిదైన కుటుంబ సభ్యులు రోదించారు. ఎమ్మెల్యే, ఎంపీ కలిసి ఒక్కో బాధితుల కుటుంబానికి రూ.10 వేలు చొప్పున అందజేశారు. వివాహానికి దాచుకున్న మంచిరెడ్డి ఈశ్వరి నగదు కాలిబూడిద కావడంతో కుటుంబానికి ఎమ్మెల్యే రెండు లక్షలు, ఎంపీ లక్ష రూపాయలు అందజేస్తామని తెలిపారు. బాధితులకు పక్కాఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. బొద్దూరు ఎంపీటీసీ వల్లూరు గణేష్ బాధిత కుటుంబాలకు 15 బస్తాల బియ్యం అందజేశారు. అనంతరం బాధితులకు 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోండ్రు జగదీష్, టీడీపీ మండలాధ్యక్షుడు గట్టి భాను, రఘు, బొద్దూరు ఎంపీటీసీ వల్లూరు గణేష్, చెలికాని మహేశ్‌బాబు, సమతం శ్రీను, రావు రవీంద్ర, వావిలపల్లి శ్రీను పాల్గొన్నారు.● సంతకవిటి మండలంలోని చిత్తారపురానికి చెందిన టీడీపీ నాయకుడు రాకోటి తిరుపతిరావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పరామర్శించారు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ కింద సాయం: కోళ్ల



బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్య సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. ఆదివారం ఎల్.కోటలో జరిగినకార్యక్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 14మందికి మంజూరైన రూ.18 లక్షల 81 వేల 201 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో శ్రీనాథు పెదబాబు, కొల్లు రమణమూర్తి, కళ్లద్దాల శ్రీను, కోళ్ల శ్రీను, గొరపల్లి రాము పాల్గొన్నారు.

సత్తాచాటిన కబడ్డీ క్రీడాకారులు



విజయనగరం రూరల్: క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన బాలబాలికల కబడ్డీ జట్లు సత్తాచాటాయి. ఈ మేరకు ఈనెల 22 నుంచి 24 వరకూ తూర్పుగోదావరి జిల్లా రావుల పాలెంలో రాష్ట్రస్థాయి 50వ జూనియర్ బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. జిల్లా జట్లు విజయం సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాయి. దీంతో క్రీడాకారులను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బెవర భరత్, నాగరాజు వర్మ, కోచ్ కోరాడ వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

విజయనగరం టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆదివారం అభినందించారు. ఈనెల 14, 15 తేదీల్లో కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా నుంచి 16మంది క్రీడాకారిణులు, 34 మంది పురుషులు మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొని 144 బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు.కార్యక్రమంలో కోచ్ శ్రీరాములు పాల్గొన్నారు.

హిందూ ధర్మం పరిరక్షణకు కృషి చేయాలి

లక్కవరపుకోట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మం పరిరక్షణకు కృషి చేయాలని కొత్తవలస సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు కోరారు.ఈమేరకు ఎల్.కోటలో హైందవ శంఖారావానికి రావాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఖండ్‌సంయోజక్ కొరుపోలు అప్పారావు, యర్ర శ్రీను, విన్నకోట గణేష్, చొక్కాకుల అప్పారావు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట,డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి):ఎస్.కోటలో ఆదివారం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వచ్చేనెల ఐదోతేదీన విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్‌కుమారి పాల్గొన్నారు.

వరి నూర్పిడి యంత్రం బోల్తా పడి విద్యార్థి మృతి



మణికంత (ఫైల్)

బొబ్బిలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణానికి సమీపంలో గున్నతోటవలస గ్రామంలో వరినూర్పిడి యంత్రం బోల్తాపడిన ఘటనలో సాలాపు మణికంఠ (12) అనే విద్యార్థి మృతిచెందాడు. సీఐ కటకం సతీష్‌కుమార్ ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని దొరల పొలంలో ఆదివారం వరి పంట నూర్పిడి జరుగుతుండగా మణికంఠతో పాటు మరో ఇద్దరు కలిసి యంత్రం పైకి ఎక్కి కూర్చున్నారు. నూర్పు యంత్రం ఒక పొలం నుంచి వేరొక పొలంలోనికి వెళ్తుండగా గట్టు ఎక్కినప్పుడు ఆ యంత్రం బోల్తా పడింది. దానిపై కూర్చున్న మణికంఠ ప్రమాదవశాత్తూ బోల్తాపడి యంత్రం కింద పడిపోయాడు. చాలా సమయం తర్వాత గ్రామస్థులు బయటకుతీశారు. కొన ఊపిరితో ఉన్న మణికంఠను బొబ్బిలి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి, అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరు చిన్నారులు అదృష్టవశాత్తూ ప్రమాదం నుంచి బయటపడ్డారు. మణికంఠ స్థానిక ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అతని తండ్రి శంకరరావు ఆటో డ్రైవరు కాగా, తల్లి పోలమ్మ గృహిణి. మృతుడికి తమ్ముడు, అక్క ఉన్నారు. మణికంఠ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నూర్పిడి యంత్ర డ్రైవర్ సింగనాపల్లి వేణుపై ఏఎస్ఐ జి.భాస్కరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఒప్పంగిలో మృతదేహం లభ్యం

రేగిడి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):రేగిడి మండలంలోని ఒప్పంగి పంట పొలాల్లో శనివారం రాత్రి గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులకథనం మేరకు..రాజాం మండలంలోని గడ్డిముడిదాం గ్రామానికి చెందిన దాసరి రాములమ్మ(75) వృద్ధురాలు కావడంతో కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరిగేది. గ్రామంలో ఒకటిరెండుసార్లు తప్పిపోయిన విషయం విదితమే. పదిరోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాములమ్మ ఆచూకీ కనిపించలేదు. అన్నిచోట్ల వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో ఆమె కుమారుడు దాసరి లక్ష్మణనాయుడు ఈనెల 22న రాజాం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యమైనట్లు ఫిర్యాదుచేయగా కేసునమోదైంది. దర్యాప్తుచేస్తున్న క్రమంలో గడిముడిదాం సరిహద్దులో రేగిడిమండలంలోని ఒప్పంగి సమీపంలో మృతదేహం లభ్యమైంది. ఆదివారం కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై రేగిడి ఎస్ఐ నీలావతి సిబ్బంది మృతదేహం లభ్యమైనప్రాంతాన్ని సందర్శించారు.గడ్డిముడిదాంగ్రామానికి చెందిన దాసరి రాములమ్మగా గుర్తించారు.ఆమె నాలుగు ఐదు రోజులకిందట మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. నిర్జీవ ప్రాంతంకావడం, ఇటీవల కురిసిన వర్షాలకుఅటు ఎవరూ వెళ్లకపోవడంతో రాములమ్మమృతిచెంది ఉండొచ్చని పోలీసుల దర్యాప్తులో తేలింది. శరీర భాగాలు గుర్తుపట్టలేని విధంగా మృతదేహంఉంది. ఈక్రమంలో కుటుంబ సభ్యులు గుర్తించడంతోరాజాం ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టంచేసి అప్పగించారు.

కొండరేజేరులో విద్యార్థి అదృశ్యం

మక్కువ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధి కొండరేజేరుకు చెందిన వాకాడ హర్ష బొబ్బిలిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 18న స్వగ్రామం వచ్చి ఇంటివద్దే ఉన్నాడు. ఈనెల 23న కళాశాలకు వెళ్తానని చెప్పి కుటుంబ సభ్యులకు తెలియజేసి బయలుదేరాడు. కళాశాలకు వెళ్లాక హర్ష నుంచి ఎటువంటి ఫోన్ రాకపోవడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. కళాశాల యాజమాన్యానికి ఫోన్‌చేశారు.దీంతో హర్ష కళాశాలకు రాలేదని కళాశాల యాజమాన్యం తెలియజేసింది.హర్ష తండ్రి వాకాడ పైడిపునాయుడు ఆదివారం ఎస్ఐ ఎం.వెంకటరమణ మూర్తికి ఫిర్యాదుచేయడంతో కేసు నమోదుచేశారు.

ఆపరేటింగ్ రూములోకి దొంగలు

భామిని, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భామిని సమీపంలోని ఎయిర్‌టెల్ టవర్ ఆపరేటింగ్ రూంపై శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. టెక్నీషియన్ కె.శంకర్ అప్రమత్తం కావడంతో దొంగలు అక్కడే స్కూటర్ విడిచిపెట్టి పారిపోయారు. తాజాగా ఈనెల 7వ తేదీ రాత్రి సొలికిరి గ్రామంలోని టవర్ నుంచి 24 బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. దీంతో అప్రమత్తమైన సంస్థ.. ఆపరేటింగ్ రూం తలుపు తీసిన వెంటనే టెక్నీషియన్‌కు రోబ్‌కాల్ వచ్చేవిధంగా ఏర్పాటు చేసింది. శనివారం దొంగలు పడ్డ సమయంలో కూడా ఇలా కాల్ రావడంతో, టెక్నీషియన్ తన తోటి స్నేహితులకు సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చి, దొంగలను వెంబడించారు. దీంతో ఆ ముగ్గురు దొంగలు అక్కడే తమ స్కూటర్‌కు విడిపెట్టి పారిపోయారు. స్థానికులు ఆ స్కూటర్‌ను బత్తిలి పోలీసులకు అందించారు. దీనిపై బత్తిలి ఎస్ఐ అనిల్‌కుమార్ వద్ద ప్రస్తావించగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

120 లీటర్ల సారా స్వాధీనం

విజయనగరంక్రైం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి):పార్వతీపురం మండలంలోని కృష్ణపల్లి సరిహద్దు శివార్లలో సారా రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని ద్విచక్రవాహనంతోపాటు, 120 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టరు ఎస్.సింహాద్రి తెలిపారు.గ్రామ శివార్లలో నిర్వహించిన తనిఖీల్లోదేవుపల్లి అజయ్, సుభాష్‌ను అదుపులోకి తీసుకుని తదుపరి చర్యలు నిమిత్తం పార్వతీపురంఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్ఐ రాజశ్రీ,హెచ్‌సీ రాంబాబు, కానిస్టేబుళ్లు రాము, మనోజ్ పాల్గొన్నారు.

గుర్ల గెడ్డపై కల్వర్టు నిర్మాణం

మెంటాడ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్ల వద్ద గెడ్డపై కల్వర్టును మాజీ మంత్రి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రవణ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు.గెడ్డపై కల్వర్టు లేకపోవడంతో అవతల ఉండే అనంతగిరి మండలంలోని పద్రిగ్రామాలు, మెంటాడ మండలంలోని పనుకువానివలస, శిలకన్నవలస గిరిజనులు,దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడేవారు. గెడ్డ ఆవల ఉన్న వ్యవసాయ భూముల్లో పంట ఉత్పత్తులు తీసుకురావడానికి రైతులు వ్యయప్రయాసలకు గురయ్యేవారు. గెడ్డ ఉధృతంగా ఉండే సమయంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. వైసీపీ హయాంలో నిధులు మంజూరైనా పనులు జరగలేదు. ఈనేపథ్యంలో ఏటోర్ సంస్థ రూ.50 లక్షలతో నిర్మించిన పైపు కల్వర్టును కిడారి శ్రవణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎటోర్(గ్రూప్‌ల సంస్థ ఫౌండర్, సీఈవో నగేష్, రొంపిల్లి సర్పంచ్ చిరంజీవి, బిద్దాన జగదీష్, పూర్నార అప్పన్న పాల్గొన్నారు.



కల్వర్టును ప్రారంభిస్తున్న శ్రవణ్ కుమార్

విద్యుత్ చార్జీల పెంపుపై జగన్ డ్రామాలు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు



మాట్లాడుతున్న రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు కారణమైన మాజీ ముఖ్యమంత్రి జగన్ ఏమీ ఎరగనట్లు డ్రామాలాడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు విమర్శించారు. ఆదివారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ చార్జీల పెంచడానికి జగనే కారణమన్నారు. లక్షల కోట్లు అక్రమార్జన కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను తాకట్టు పెట్టిన జగన్ ప్రజల సంక్షేమం పేరుతో రోడ్డెక్కడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకోసం చంద్రబాబునాయుడు అహర్నిశలు పని చేస్తున్నారన్నారు. కాగా గుర్ల మండలంలోని గోషాడకు చెందిన బాగురోతు సత్యంనాయుడుకు రూ.1,21,198, చీపురుపల్లి మండలంలోని అలజంగికి చెందిన మీసాల సూరప్పడుకు రూ.51,531లు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను రామ్‌మల్లిక్‌నాయుడు పంపిణీచేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, మహంతి అప్పలనాయుడు, శనపతి శ్రీనివాసరావు, ఇజరోతు రాంబాబు, దన్నాన సూరపునాయుడు పాల్గొన్నారు.

గుర్ల బీజేపీ మండలాధ్యక్షుడిగా కనకరాజు

గుర్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆనందపురం గ్రామానికి చెందిన పోలిపల్లి కనకరాజు బీజేపీ మండలాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం గుర్లలో బీజేపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌వర్మ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం తమ పార్టీ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్‌వీఎల్ఎన్ రాజు, రాష్ట్ర మహిళా కార్యదర్శి నాగమల్లిక, జిల్లాఉపాధ్యక్షుడు వెంకటఅప్పారావు, గరివిడి మండలాధ్యక్షులు త్రినాథ్ గొర్లె పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

రాజాం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం రాజాంలో నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్న పలువిద్యాసంస్థల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపి, మూసివేయించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్ పాల్గొన్నారు.

బొంతలకోటికి అరుదైన గౌరవం

●వరల్డ్‌బుక్‌ఆఫ్ రికార్డులో స్థానం



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదైన ధ్రువపత్రంతో శంకరరావు

గజపతినగరం, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): ఇరవై ఐదు సంవత్సరాలుగా కళారూపాలతో సంగీత వాయిద్య పరికరాలతో కళా బోధనచేస్తూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా పేరొందిన డాక్టర్ బొంతలకోటి శంకరరావుకు వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. ఈవిషయాన్ని ఆయనే విలేకరులకు ఆదివారం తెలిపారు. ఈనెల 11న వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో తన పేరు నమోదైనట్లు వివరించారు. మరుగున పడిపోతున్న జానపద కళారూపాలను బతికిస్తూ.. మరో పక్క ప్రస్తుత తరానికి జానపద కళారూపాల ప్రాధాన్యం తెలియజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడంతో పాటు బడి అంటే భయం దూరం చేసే కళా బోధన విధానాన్ని అమలు చేస్తూ కొత్త ఒరవడికి అంకురార్పణ చేసినందుకు ప్రపంచ రికార్డులో తనకు స్థానం లభించిందన్నారు. మెంటాడ మండల గుర్లతమ్మిరాజుపేట హైస్కూలులో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయన గజపతినగరం పట్టణంలో నివాసం ఉంటున్నారు. బొంతలకోటికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కడంపై జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యంనాయుడు అభినందించారు.

రాజాంలో రారావే సమావేశం

రాజాం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజాంలో ఆదివారం రాజాం రచయితల వేదిక(రారావే) 119వ నెలవారీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాహితీవేత్త పిల్లా తిరుపతిరావు కళింగాంధ్ర దళిత కవిత్వం అన్న అంశంపై మాట్లాడారు. సమతం మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, రౌతు గణపతిరావునాయుడు, ఒమ్మి రమణమూర్తి, ఉరిటి గున్నేశ్వరరావు, పడాల కవీశ్వరరావు, రజాపు శాంతారావు పాల్గొన్నారు

పల్లెల అభివృద్ధే ధ్యేయం

డెంకాడ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే కూటమి ధ్యేయమని మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు తెలిపారు. ఆదివారం పినతాడివాడలో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రతిపక్షం ప్రభుత్వంపై బురద జల్లె కార్యక్రమం చేపడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పల్లె భాస్కరరావు, పీఆర్ఐ జేఈ రమేష్, జనసేన నాయకులు చింతపల్లి రామ్మూర్తి, గేదెల అర్జున పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్‌పై ఫోకస్!

(ఐదో పేజీ తరువాయి)

భూములను ఇతరులకు విక్రయించేవారు. ఇదే సమయంలో కొంతమంది బడా బాబులు పేదల భూములను కొనుగోలు చేసుకుని వారి ఆధీనంలో ఉంచుకునేవారు. కాగా వైసీపీ హయాంలో ఫ్రీహోల్డ్‌ను ఆసరాగా తీసుకున్న అక్రమార్కులు పేదల పేరున ఉన్న అసైన్డ్ భూములపై కన్నేశారు. జీవోను అడ్డం పెట్టుకొని ఆ భూములను కొనుగోలు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అధికారుల సహకారంతో మరికొందరు బరితెగించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆ భూములను సొంతం చేసుకున్నారు. పార్వతీపురం మండలం ములగ పంచాయతీతో పాటు వివిధ మండలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొంతమంది వైసీపీ నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో భూములు ఫ్రీహోల్డ్ చేశారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో జరుగుతున్న ఈ అవకతవకలపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి.

నివేదిక సిద్ధం చేశాం..

ఫ్రీ హోల్డ్ జరిగిన భూముల వివరాలను నివేదిక రూపంలో సిద్ధం చేశాం. ఎక్కడైనా పొరపాట్లు జరిగినట్టు రుజువైతే ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం చర్యలు ఉంటాయి.

- హేమలత, జిల్లా రెవెన్యూ అధికారి, పార్వతీపురం మన్యం

ఇది నాటి సర్కారు పాపం

(ఐదో పేజీ తరువాయి)

కూడా లేదు. తరగతి గదుల్లో బెంచీలు కూడా లేకపోవడంతో గిరిజన విద్యార్థులు నేల పైనే చదువులు కొనసాగించాల్సి వస్తోంది.

ప్రభుత్వం దృష్టి సారించాలి

గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పునాది దశలో నిలిచిపోయిన నాడు-నేడు పాఠశాలల భవన నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి. నిధులు కేటాయించి ఆయా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.' అని గిరిజన సంఘం నాయకులు పాలక సాంబయ్య, లక్ష్మణరావు తదితరులు కోరుతున్నారు.

ఎంఈవో ఏమన్నారంటే..

'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు మొదటి విడతలో ఎంపికైన పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. రెండో విడతలో చేపట్టిన పనులన్నీ సగంలో నిలిచిపోయాయి. బిల్లులు సకాలంలో మంజూరుకాక పోవడమే ఇందుకు కారణం.' అని ఎంఈవో ఆనందరావు తెలిపారు.

గ్రామాల్లో భూ సమస్య లేకుండా చేయాలి

● మంత్రి సంధ్యారాణి ● ప్రజా దర్బార్‌కు అనూహ్య స్పందన



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్య లేకుండా చేయాలని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఆదివారం సాలూరులోని తన నివాసంలో ఆమె ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంతో పాటు రెండు జిల్లాల నుంచి భారీ స్థాయిలో ప్రజలు వచ్చి ఆమెకు వినతులు సమర్పించారు. అనంతరం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రజా సమస్యలు నిర్లక్ష్యం చేయకుండా ప్రాధాన్యతా ప్రకారం సమస్యలు పరిష్కారం జరిగేలా చర్యలు చేపట్టడానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. వీఆర్వో నుంచి తహసీల్దార్ వరకు గ్రామాల్లో పర్యటించి భూ సమస్యలు పరిష్కరించాలని ఆమె సూచించారు.

సకాలంలో నిర్మాణాలు పూర్తి కావాలి

సీతంపేట రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సీతంపేటలోని సూపర్ స్పెషాలిటీ, 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులు సకాలంలో పూర్తిచేసి రోగులకు అందుబాటులోకి తీసుకు రావాలని సీపీఎం నాయకులు తిరుపతిరావు, భాస్కరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. ఆదివాసీ ప్రజలు, విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నా ఇంతవరకు హెల్త్ అసిస్టెంట్ల నియామకం చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఐటీడీఏలో పాలకవర్గ సమావేశం ఇంతవరకు నిర్వహించకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు పాలక సాంబయ్య, సర్పంచ్ సుందరమ్మ ఉన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సర్కిల్ పరిధిలోని జోగిందరవలస గ్రామంలో ఆదివారం సుమారు 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని బొబ్బిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామంలో ఎస్ఐ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ మెట్ట శ్రీనివాసరావు, కానిస్టేబుల్ ప్రసాదరావు సిబ్బందితో దాడులు నిర్వహించారని చెప్పారు. ఆ దాడుల్లో బెల్లంఊటను ధ్వంసం చేసి అనంతరం చుట్టుపక్కల గ్రామాల్లో కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు.

మెరుగైన ఫలితాల కోసం అదనపు తరగతులు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత ఫలితాలు సాధించేందుకు గాను పాఠశాల విద్యాశాఖ ఎస్‌ఈఆర్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక వందరోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఆదివారం నారసింహునిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు, గణిత ఉపాధ్యాయుడు ఎస్.రమేష్ ఆధ్వర్యంలో అదనపు తరగతులు నిర్వహించారు. ఇలా అదనపు తరగతులతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని హెచ్‌ఎం ఎస్.రామారావు తెలిపారు.

ఐక్యతతోనే శిష్టకరణాల అభివృద్ధి

విజయనగరం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శిష్టకరణాలు ఐక్యతతో ముందుకువెళ్తేనే అభివృద్ధి సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపీ గౌరీశ్వరరావు తెలిపారు. ఆదివారం విజయనగరంలోని గుంటూరు వారు వీధిలో కమిటీ కార్యాలయంలో శిష్టకరణం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గౌరీశ్వరరావు మాట్లాడుతూ శిష్టకరణాలు ఏకతాటితో ఒకే బాటలో నడిస్తే, ఓబీసీ సాధించుకోవచ్చన్నారు. ప్రధాన కార్యదర్శి రేగా సురేష్, నగరశాఖ గౌరవాధ్యక్షుడు త్రినాథ్ ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ సంఘం ప్రతినిధులు ఒకే మాటతో కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుధాకర్ పట్నాయక్, వెంకటేష్, బలివాడ వెంకట రమణారావు, సుధాకర్, వరప్రసాద్, సంజీవరావు, తిరుపతిరావు, ధనుంజయరావు, త్యాడ ప్రసాదరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

సాలూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్లను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కో చైర్మన్ బి.కాంతారావు కోరారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు ఏఏ హామీలు ఇచ్చిందో అవన్నీ తక్షణం అమలు చేయాలని కోరారు. చిరుద్యోగుల కోసం సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. సమ్మె చేస్తున్న గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకుడు ఎన్వై నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంతారావు

నిర్మించారు సరే.. ప్రారంభించేదెప్పుడు?

● నిరుపయోగంగా భామిని గిరిజన ఆశ్రమ పాఠశాల అదనపు భవనం

● ఇరుకు గదుల్లో విద్యార్థులకు తప్పని అవస్థలు

● పట్టించుకోని అధికారులు





ప్రారంభానికి నోచుకోని ఆశ్రమ పాఠశాల అదనపు భవనం, ఇరుకు గదుల్లో అవస్థలు పడుతున్న విద్యార్థులు

భామిని, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భామినిలో గిరిజన విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలతో కేంద్ర ప్రభుత్వం రూ.8.57 కోట్లతో నిర్మించిన అదనపు భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడి ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి నుంచి పదోతరగతి 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ వారికి సరైన వసతి సదుపాయం లేదు. దీంతో వారు ఇబ్బంది పడుతున్నారు. పడుకొనే సమయంలో బెంచీలు పక్కకు తప్పించి నేలపైనే నిద్రిస్తున్నారు. విద్యార్థులు ఆటలకు సైతం ఇక్కడ మైదానం లేదు. ఇటీవల పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో దృష్టికి హెచ్‌ఎం నాగభూషణరావు, వార్డెన్ సత్యనారాయణ తీసుకెళ్లారు. అయినప్పటికీ ఫలితం శూన్యం. ఇక్కడ పాఠశాలలో జరిగిన పనులకు గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని తక్షణం ప్రారంభించేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది కోరుతున్నారు.

ఏమీ చేయలేని పరిస్థితి

బిల్లులు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ కోర్టుకు ఆశ్రయించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కాబట్టి ఏమీ చేయలేని పరిస్థితి.

- సింహాచలం, ఐటీడీఏ డీఈ

ఎయిర్‌ఫోర్స్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పార్వతీపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో మెడికల్ అసిస్టెంట్, ఫార్మాసిస్ట్ ట్రేడుల్లో ఎయిర్‌మెన్‌గా చేరడానికి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అదనపు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసిందని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెడికల్ అసిస్టెంట్, ఫార్మాసిస్ట్ ట్రేడుల్లో ఎయిర్‌మెన్ ఉద్యోగాలకు శాశ్వత ప్రాతిపదికన నియామకం చేపడుతున్నారని తెలిపారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో యువత రిక్రూట్‌మెంట్‌లో ర్యాలీలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఇంటర్ అర్హతతో మెడికల్ అసిస్టెంట్ ఉద్యోగం..

ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్ కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్టుతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. అన్ని సబ్జెక్టుల్లో సగటున 50 శాతం మార్కులు ఉండాలని, ఇంగ్లీష్‌లో కూడా 50శాతం మార్కులు రావాలని చెప్పారు. వివాహం కాని 2004 జూలై 1 నుంచి 2008 జూలై 3 మధ్యన పుట్టిన అభ్యర్థులు అర్హులన్నారు. బీఎస్సీ డిప్లొమా ఫార్మసీతో మెడికల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్టుతో ఉతీర్ణులై ఉండాలన్నారు. సరాసరి 50 శాతం మార్కులు ఉండాలని, 50 శాతం మార్కులు ఇంగ్లీష్‌లో కూడా రావాలన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష, రాతపరీక్ష, మెడికల్ పరీక్ష ఉంటాయని చెప్పారు. పైన పేర్కొన్న అర్హతలు కలిగి ఉన్న అభ్యర్థులు మహరాజస్ కాలేజ్ గ్రౌండ్, పీటీ ఉష రోడ్డు, షీనస్, ఎర్నాకులం, కొచ్చి కేరళ 682011 చిరునామాతో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో జరిగే రిక్రూట్‌మెంట్ ర్యాలీలో అర్హత కలిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు చెందిన అభ్యర్థులు హాజరు కావచ్చునని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9177297528, 7993795796, 7382559022, 6303493720 సంప్రదించాలన్నారు.

సీఎం సహాయ నిధి పంపిణీ



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం/ జియ్యమ్మవలస, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలంలోని అప్పనదొరవలస గ్రామంలో ఏలూరు మధుమతి బ్రెయిన్‌ట్యూమర్‌తో బాధపడుతోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షల 76వేల 279 రావడానికి కృషి చేశారు. ఈ మేరకు ఆదివారం గుమ్మలక్ష్మీపురంలోని తన స్వగృహంలో ఆమె బాధిత కుటుంబానికి ఈ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ దీక్షలు

చీపురుపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారమయ్యే వరకూ దీక్షలు విరమించేది లేదని సీఐటీయూ జిల్లా నాయకుడు రమణ తెలిపారు. కర్లాం వద్ద కోళ్ల పరిశ్రమ కార్మికులు ప్రారంభించిన నిరవధిక దీక్షలు మూడో రోజు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పోలీసులను చూపించి భయపెట్టాలని యాజమాన్యం చూస్తోందని, ఇప్పటికైనా యాజమాన్యం మొండి వైఖరి విడనాడి, వేతన పెంపుదలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంబల్ల గౌరినాయుడు, ఐ. గురునాయుడు, టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలి

నెల్లిమర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు కోరారు. ఆదివారం నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి, కేసులపై ఆరా తీశారు. గంజాయి వినియోగం, అక్రమ రవాణా, మహిళలపై జరుగుతున్న నేరాలు, అసాంఘిక కార్యక్రమాల నియంత్రణకు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, ఎస్ఐ బి.గణేష్ పాల్గొన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఏఎస్ఐ మూర్తితో పాటు పలువురు కానిస్టేబుళ్లకు డీఎస్పీ బహుమతులు అందజేశారు.

6న రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ ఎంపికలు

బొబ్బిలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 6న విజయనగరం రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో ఐదవ జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చీమల రాంబాబు, ప్రభుదాస్ తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఫిబ్రవరి 17-20 తేదీలలో తమిళనాడులోని చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 23వ జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-25 కోసం ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. విజయనగరం స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి దివ్యాంగ క్రీడా పోటీలకు పారా క్రీడాకారులు తమ పేర్లను వచ్చే నెల 4లోగా నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. పూర్తి వివరాలకు 9390131777, 8142018671, 9963493800 నెంబర్లకు సంప్రదించాలని వారు చెప్పారు.

యూటీఎఫ్ నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్

వీరఘట్టం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీగాయత్రీ కాలేజ్‌లో ఆదివారం యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 20 మండలాల నుంచి 226 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ మోడల్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు యూటీఎఫ్ వీరఘట్టం మండల శాఖ బహుమతులు అందించింది. ఈ పరీక్షలో మొదటి 30 స్థానాలు పొందిన 33 మంది విద్యార్థులకు వచ్చే ఏడాది జనవరి 12న స్థానిక జడ్పీహెచ్ఎస్ వీరఘట్టం పాఠశాలలో నవోదయ ఫైనల్ మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా, మండల బాధ్యులు మజ్జి పైడి రాజు, కురమాన గోవిందరావు, బోనంగి దుర్గాప్రసాద్, మహేష్, గౌరునాయుడు, స్వామిబాబు తదితరులున్నారు.

హైందవ శంఖారావానికి ఆహ్వానం

బొబ్బిలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చే నెల 5న జరుగనున్న హైందవ శంఖారావానికి హాజరు కావాలని ఎమ్మెల్యే బేబీనాయనను ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి, ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆర్ఎస్ ఎస్ సహప్రాంత ప్రచార్ జనార్దన్, విభాగ్ ప్రచారక్ రాజశేఖర్, విభాగ్ కార్యవాహక్ డీవీ రమణమూర్తి తదితరులు ఉన్నారు.

క్రీడా స్ఫూర్తి అవసరం

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన సూచించారు. మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ యూత్ నిర్వహించిన ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం టాస్‌వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. పార్వతీపురం, బొబ్బిలి టీం సభ్యులను పరిచయం చేసుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కోడూరు షణ్ముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, కరణం విజయ భాస్కరరావు, ఎస్ఐ వెలమల ప్రసాదరావు, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సరదాగా కాసేపు..

● పర్యాటక ప్రాంతాల్లో కలెక్టర్ సందడి



కుటుంబ సభ్యులతో కలిసి హ్యాంగింగ్ బ్రిడ్జ్‌పై నడుస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

సీతంపేట రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): క్షణం తీరిక లేకుండా గడిపే ఆ అధికారి.. కుటుంబంతో కలిసి కాసేపు సరదాగా గడపాలని సీతంపేట మన్యంలో పర్యటించారు. పార్వతీపురం మన్యం కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఆడలి వ్యూ పాయింట్, బెనరాయి జలపాతం, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో సందడి చేశారు. పార్క్‌లోని సాహస క్రీడల్లో పాల్గొని ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. షూటింగ్, హ్యాంగింగ్ బ్రిడ్జ్, బోటింగ్ వంటి సాహస క్రీడల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

ఎంపీ కలిశెట్టికి అభినందన



ఎంపీ కలిశెట్టిని అభినందిస్తున్న దృశ్యం

పాలకొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి, రాజాం, పాలకొండ, సీతంపేట, కొత్తూరు, హడ్డుబంగి, పర్లాకిమిడి మీదుగా పలాసకు రైల్వే ట్రాక్ ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు పలువురు అభినందనలు తెలుపుతున్నారు. ఆదివారం పాలకొండ నియోజకవర్గ పెద్దలు రణస్థలం వెళ్లి, ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో పాలకొండకు చెందిన టంకాల దుర్గారావు, కనపాక చౌదరి నాయుడు, బుడితి అప్పలనాయుడు, బెజ్జిపురం చిన్నంనాయుడు, పామోటి వైకుంఠరావు తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ఉద్యాన పంటలు సాగుపై సంక్షేమ నేస్తాలు దృష్టి సారించాలని జట్టు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు సూచించారు. ఆదివారం తోటపల్లి అన్నపూర్ణేశ్వరి గిరిశక్తి ప్రాంతంలో ఉద్యాన పంటల కందకాలు నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన నేస్తాలకు రెండు రోజుల పాటు సంక్షేమ పథకాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో గిరిజన గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించామన్నారు. గిరిజనులకు సంబంధించి పోడు పట్టాలు ఉన్నవారికి 150 రోజులు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. అలాగే 96 పనులు నిర్వహించుకోవచ్చునన్నారు. 20 రకాల పండ్ల జాతి మొక్కలు అందిస్తామని తెలిపారు. సిబ్బంది ఎం.నూకంనాయుడు, జి.మురళీమోహన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పొలం పనుల్లో బిజీ బిజీ



యంత్రంతో వరి పంట నూర్చుతున్న రైతులు

వీరఘట్టం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఇబ్బందులకు గురయ్యారు. తుఫాన్ తగ్గి వాతావరణం అనుకూలించడంతో పొలం పనుల్లో బిజీ అయ్యారు. కోసిన వరి పంటను యంత్రాలతో నూర్చుతున్నారు. చెరకు గడలను కొట్టి ఫ్యాక్టరీకి పంపిస్తున్నారు.

న్యూస్ బాక్స్

జనసేనలోకి పది కుటుంబాలు

చీపురుపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గరివిడి మండలంలోని తాటిగూడలోగల పది వైసీపీ కుటుంబాలు జనసేనలో చేరాయి. ఆదివారం చీపురుపల్లి పట్టణంలోని జనసేన కార్యాలయంలో యడ్ల రమణ, చీమల రామారావు, ఎడ్ల నూకరాజు, రౌతు సూర్యం, అంపోలు ఉమాశంకర్ తదితరులకు పార్టీ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు కండువాలు కప్పి ఆహ్వానించారు.

'గచ్చెంసెట్టుకి అటూ ఇటూ' పుస్తకావిష్కరణ

విజయనగరం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురజాడ నివాసంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం కవి పాయల మురళీకృష్ణ రచించిన కవితా సంపుటి 'గచ్చెంసెట్టుకి అటూ ఇటూ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి సంస్థ నిర్వాహకుడు చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగి న కార్యక్రమంలో డీఈవో యు.మాణిక్యాల నాయుడు, హెచ్‌ఎం సన్యాసి రాజు, ద్వారం దుర్గాప్రసాదరావు, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, గార రంగనాథం పాల్గొన్నారు.

48 మంది రక్తదానం

నెల్లిమర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జరజాపుపేటలో సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 48 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గరివిడి ఎంఈవో పోలుబోతు రామారావు, డాక్టర్ అవనాపు భానుప్రకాష్, గ్రామ పెద్దలు రక్తదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పోలుబోతు దుర్గాప్రసాద్, బెల్లాన వెంకటరావు, పసుమర్తి వెంకటరమణ, తుమ్ము అశోక్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల హెచ్‌సీకి అభినందన

నెల్లిమర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేందుకు కృషిచేసిన నెల్లిమర్ల పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ అల్లూరి మురళీ (రాజు)కు ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసించారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆదివారం ఎస్ఐ గణేష్‌కు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

నూతన సంవత్సర వేడుకలపై నిఘా

వీరఘట్టం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జి.కళానిధి తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు నిర్వహించరాదని, అర్ధరాత్రి కేక్ కటింగ్, మద్యం తాగడం, అశ్లీల నృత్యాలు ప్రదర్శించడం, డీజేలు, బైక్, కారు రేసులు నిర్వహించకూడదన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన

పాలకొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గారమ్మ కాలనీలో తాగునీటి పైపులైన్ల మరమ్మతులను నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్‌రావు ఆదివారం పరిశీలించారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

కౌశల్ పోటీలకు సంతోష్ ఎంపిక

కొమరాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి మండంగి సంతోష్ జిల్లా స్థాయిలో జరిగిన కౌశల్ పోటీల్లో రీసైక్లింగ్ ఆఫ్ వేస్ట్ మేనేజిమెంట్ అనే అంశంపై పోస్టల్ ప్రజెంటేషన్‌లో రెండవ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు ఈనెల 30న విజయవాడలో రాష్ట్ర స్థాయిలో జరుగనున్న కౌశల్- 2024 పోటీలకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా సంతోష్‌ను పాఠశాల హెచ్‌ఎం డి.లక్ష్మణరావు ఆదివారం అభినందనలు తెలిపారు.

డైట్ బిల్లులు విడుదల చేయాలి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ వసతి గృహాలకు పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను విడుదల చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పల్ల సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఐదు నెలలుగా డైట్ బిల్లులు లేక వసతిగృహ సంరక్షకులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ధరలు పెరగడం వల్ల సరుకులు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు విడుదల చేయాలని ఆయన కోరారు.